

# చంపకం

ప్రయాగ రామకృష్ణ

చెరువులోకి రాళ్ళు విసరని చేతులుండవను కుంటాను. అయినా చలనం లేని సంద్రంలో వేసిన గులక రాయి లేపే తరంగాలు ఎంతసేపుంటాయి గనుక. అంతేనేమో కొందరి జీవితాలు —

ఏవో ఆలోచిస్తూ మెట్లు దిగుతూనే తలెత్తి తృళ్ళిపడి నిలబడి పోయాను అచేతనంగా. ఆవిడ సిగ్గుతో ఓ పక్కకి ఒదిగింది నాకు దారిఇస్తూ. దించిన తల ఎత్తలేదు సరికదా కనీసం నావైపు చూడటానికి కూడా ప్రయత్నం చేసినట్టులేదు. నేనలాగే నిలబడిపోవటం చూసి గాభరాపడ్డట్టుంది. పెదవులు బిడియంతో కంపించాయి. నేనది గ్రహించి పక్కకు తప్పుకున్నాను. ఎదురుగా వున్న పొన్నాయి చెట్టువైపు వడివడిగా అడుగులు వేస్తూ గిరుక్కున ఒకసారి వెనక్కి తిరిగి నా వైపు చూసింది. నేనింకా అక్కడే నిలబడున్నాను. చిన్నగా నవ్వింది - వెలుగును మింగుతున్న ఆకాశంలోని కొసమెరుపులా వుందా నవ్వు.

ఎవరీవిడ ? ఎందుకలా నవ్వింది ? - ఆలోచనలు మనస్సుని కొరుక్కుతింటున్నాయి. ప్రతి క్షణం ఆ క్షణం కాకూడదా అన్నయోచన. ఆ ఆనందం కొద్దిసేపేనా అన్న బాధ.

ఏదో అలికిడయింది. తృళ్ళిపడ్డాను.

విసురుగా వీచిన గాలికి చెట్ల ఆకులు రాలి కిందపడ్డాయి. కడుపుగా మన్నుతిన్న పాములా కదిలి వెళ్ళి యిసుక దిన్నెమీద కూర్చున్నాను. మధ్య మధ్యన బొట్టు పెట్టినట్టు చెరువునిండా ఎర్రటి కలువ పూలు.

ఒక్కోరాయి నీటిలోవేస్తూ ఆలోచిస్తున్నాను.

ఎవరై వుంటుందావిడ ?—

ఆలోచన తెగలేదు.

లేచి నిలబడి చెట్ల మధ్యగా నడిచాను. ఆవిడ కనిపించీ కనిపించకుండా నాకళ్ళను మభ్యపెడుతోంది. ఆవిడ్ని ఏదేదో అడగాలను కున్నాను. కానీ తీరా ఆవిడ దగ్గరకు వెళ్ళిన తరువాత నేనడగదలచుకున్న వేవో నాకు గుర్తుంటాయా ఏమో అనుమానమే ! నిజంగా నిండుగా నవ్వేవారిని చూస్తే నాకు భయం. ఆ నవ్వు వెనక పెద్ద అగాధాన్ని దాచుకోవటం చాలా మందికి అలవాటు.

ఇలాంటి వనేమీ ఆవిడకు లేదుకదా.

గాలిజోరు తగ్గి సముదాయింపుగా వుంది దగ్గరగా వెళ్ళినిలబడ్డాను. ఆవిడ నన్ను చూచినట్టులేదు మరోవైపు తిరిగి గడ్డంకింద చేయి ఆన్చుకుని చెరువులోకి చూస్తూ కూర్చుంది. పాముకుబుసం లాంటి పల్చని చీర, అగ్నిశిఖలా మెరిసే తెల్లటి శరీరం. ఆ చంపల్లో పెదవుల్లో బొత్తిగా పసితనం కనబడలేదు.

ఎంతసేపు అలా కూర్చుందో.

ఆవిడ కదిలనంతసేపూ నేనూ దూరంగా చెట్టునానుకుని అలాగే చూస్తూ నిలబడిపోయాను. చెరువు దగ్గర బంగళానిండా రక రకాల పూలమొక్కలు. గాలికి లేచిన పూల పరిమళం ఆ ప్రాంతం అంతా అవరిస్తుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా వీచిన గాలికి పువ్వులు రాలి కింద పడ్డాయి. ఆకాశంలోని నక్షత్రాల్లా నేలనిండా తెల్లటిపూలు. వెలుగురేఖలు పూర్తిగా హరించుకుపోయాయి. మసక చీకటిరాత్రి నిశ్శబ్దంతో కలిసి రోదిస్తోంది. ఏంత వింత శబ్దాలు ఎన్నో వినిపిస్తున్నాయి. ఆవిడ వెళ్ళిపోవటానికి సిద్ధమైనట్టుంది. దూరంగా వున్న భోగన్‌విల్లా దగ్గరకొచ్చి పక్కనే వున్న జినియా పువ్వులు అందుకుంటోంది.

ఆవిడ్ని చూచినప్పటినుంచీ నా మనస్సు అదోలా వుంది.

ఆవిడ అందం తనను పిచ్చివాడ్ని చేయలేదు కదా ! నా అనుమానానికి నాకే నవ్వొచ్చింది. ఆవిడలోని అందమే కాదు, ఇంకా ఏదో... నాకు అందని ఆలోచన.

కొండను చుట్టిన పాములా బంగళా మధ్యనుంచి ఊళ్ళోకి పెద్ద త్రోవ వున్నా ఆ ప్రాంతంలో ఒక్క వీధి దీపం కూడ కనబడదు. చెరువు ఒడ్డునే ఆంజనేయస్వామి గుడి, ఓ చిన్న పడవ, పడవను ఒడ్డునుంచి కదలనీయకుండా చేయటానికి లోతుగా పాతిన ఓ ఇనుప స్తంభం. గొలుసులాంటిది అమర్చి వుంటుంది.

ఆటుకుండా పోయే బస్సులు నామకా బసు నిముషాలు మాత్రం ఆగుతాయక్కడ. అటే వెళ్తోంది ఆవిడ. పిలుద్దామనుకున్నాను. కాని పేరు తెలీదు, అదీగాక రాత్రి చీకటిలో ఈ అదురుపాటు చెరువు ఒడున ఆవిడతో మాట్లాడటం ఎవరైనా చూస్తే ...

రోడ్డెక్కిన తరువాత ఆవిడ వెనక్కి తిరిగింది. నన్ను గుర్తు పటిందేమో. నేను దగ్గరకు వచ్చే వరకూ అలాగే నిలబడుంది. నేను మరికొంచెం దగ్గరకురాగానే చిన్నగా నవ్వింది. నివ్వెరపోయినా తమాయించుకుని నిలబడ్డాను. ఆవిడ తలలోవి మల్లెపూల పచ్చివాసన గుప్పుమంది.

'మీ అంత పిరికివాడ్ని నే నెక్కడా చూడలేదు. ఇప్పటివరకూ చీకట్లో ఒక్కదాన్నే కూర్చున్నాను. దగ్గరకొచ్చి మాట్లాడితే మీ నోటి ముత్యాలు రాలుతాయను కున్నారా ?" బుగ్గన చేయి ఆన్చుకుంటూ అంది.

మాటలేమీ దొరకలేదు నాకు. ఇద్దరం పక్క పక్కనే నడుస్తూ వస్తున్నాం. నేను వంచిన తల ఎత్తలేదు. చేయికదిపితే ఆవిడ భుజం తగిలేట్టుంది.

"ఎందుకండీ అంత భయపడతారు నన్ను చూసి" అంది నవ్వుతూ. తలెత్తి ఆవిడవైపు చూశాను మల్లెలు తలలోంచి ముందుకు వేలాడుతున్నాయి మునివేళ్ళతో ముఖంమీది ముంగురులను సరిచేసుకుంటోంది.

"పెళ్ళయిందా"

ఆశ్చర్యం వేసింది. "నాకా మీకా" అన్నాను.

"అన్నీ మాటలు కూడాను" చీరకొంగును భుజంమీద నుంచి గట్టిగా మీదకు తీసుకుంది. వుత్తడి బొమ్మలా అనిపించింది.

"నిజం చెప్పండి మీరు దేన్ని గురించో ఆలోచిస్తున్నారు కదూ"

..............

"ఈఒక్క రాత్రికి అన్నిటినీ మరిచిపోలేరూ"

ఆవిడ ఏం మాట్లాడుతోందో నా కర్థం కావటం లేదు. అన్నిటికీ 'ఊఁ' మాత్రం కొడ్తున్నాను. తరువాత ఆవిడ వెళ్ళిపోయింది. వెళ్ళిన తరువాత అనిపించింది. కనీసం పేరైనా తెలుసుకోలేదే అని ఏమై వుంటుందో... యింత అందమైన ఆడవాళ్ళు పెట్టుకునే పేర్లు ఎలా వుంటాయో

* * *

ఆ సాయంత్రం నాకు బాగా జ్ఞాపకం.

ఆ నవ్వుకోసం మళ్ళీ మనసు తహతహలాడింది. చెరువు ఒడ్డున నిలబడి ఆవిడకోసం ఎంతో సేపు ఎదురు చూశాను. ఎక్కడా కనబడలేదు. తెలియని కొత్త ఆలోచన మనస్సుని ఒరుసుకుంటోంది. బంగళాలో సిమెంటు బెంచీ మరీ చల్లగావుంది. ఎక్కువసేపు కూర్చోలేక పోయాను. లేచివచ్చి పొన్నాగ చెట్టు నానుకుని నిలబడ్డాను. వెనకనుండా వచ్చి నా కళ్ళను మూశాయి ఎవరివో రెండు చేతులు. గాజులు చప్పుడవటంతో కనుక్కున్నాను.

'నిన్న రాలేదేం, ఒక్కతినే ఒంటరిగాకూర్చో వలసివచ్చింది' అంది మెడచుట్టూ చేతులు వేస్తూ.

మరి పదేళ్ళయినా ఆ కళ్ళల్లో మత్తుతో ఆ బిగువుతో యిలానే బ్రతగ్గలదని పించింది ఆవిడ నాకు

'నాకు ఆడవాళ్ళమీద నమ్మకం తక్కువ. అన్నట్టు మీరు నిన్న ఇక్కడికి వచ్చారా?'

ఆవిడ ఒకటే నవ్వు.

లేచి నిలబడ్డాను. ఆవిడింకా నవ్వుతూనేవుంది. దగ్గరకు వెళ్ళి చేయి అందించాను. ఆశ్చర్యంగా చూసింది.

చేయి అందించినపుడు ఆవిడ మరింత చేరువగా వచ్చింది నాకు. గుండెలమీద చేర్చుకోవా అనిపించింది.

'వదిలెయ్యండి నన్ను' అంది బలహీనంగా.

'ఏం'

'నేను చెప్పలేను నాగురించి అడక్కండి'

సిగలో మల్లెపూలు దారంనుంచి విడివడి మా మధ్యగా పడ్డాయి. వంగి తీయబోయాను.

'వాటికా అదృష్టం లేదులేండి'

ఏడుస్తోంది ఆవిడ

'ఏమిటో చెప్పు అనవసరంగా ఎందుకు బాధ పడటం.'

జవాబేం చెప్పలేదు. నా ప్రశ్న అంత బరువైందని నిడాలికి నాకు తెలీదు.

'ఇష్టం లేకపోతే చెప్పకు.'

* * *

కురులన్నీ గాలికి లేచి ముఖానచిందరవందరగా పడ్డాయి. వాటిని సర్దుకుంటూ అంది. "నన్నేం అడక్కండి మీకు పుణ్యం వుంటుంది." అని అరచేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చింది. పొందికగా వున్న నా మనసు గాయపడింది. ఈవిడ మనస్సులో ఎన్ని అగాధాలున్నాయో, వాటి నన్నిటినీ గుండెల్లోనే పదిలంగా దాచుకుని పైకి పైకి మాత్రం చిరునవ్వు నవ్వుతోంది ఆమెవేపు చూశాను. వణుకుతున్నాయి. చెక్కిళ్ళు గుండెలు పగిలేలా ఏడ్చింది.

"మీ కర్థంగాదులేండి. నా మీద మీ కెందుకింత జాలి నాలాగా బ్రతకడానికి ఎవరైనా ఎంత పాపం చేసుకోవాలో!"

* * *

ఆ తర్వాత చాల రోజుల వరకూ ఆవిడ నాకు కనిపించలేదు. మరో నెలరోజుల తరువాత అనుకుంటాను – చెరువు దగ్గర చేపలు పట్టుకునేవాళ్ళు ఓ పదిమంది కనిపించారు. వాళ్ళల్లో ఎక్కడైనా ఆవిడ కనిపిస్తుందేమోనని ఆత్రంగా చూశాను. ఆవిడ్నిగురించి ఆలోచించడం వ్యసనంలా తయారైంది. ఓసారి కనిపిస్తే బావుణ్ణు-పిచ్చిగా శూన్యంలోకి చూస్తూ చెరువుగట్టు దగ్గర మెట్లమీద కూర్చున్నాను. వాళ్ళేదో మాట్లాడుకుంటున్నారు. మధ్య మధ్యలో పెద్దగా నవ్వులు వినిపిస్తున్నాయి. చివరి బస్సుకూడ వచ్చి వెళ్ళిపోయింది. అంటే పది దాటిందన్నమాట

తిరిగి వెళ్ళిపోబోతుంటే పెద్ద పెట్టున ఎవ్వరో అరచిన కేక వినిపించింది. భయంతో వెనక్కి తిరిగాను. చెరువు ఒడ్డున దుంగకి జుట్టు పట్టుకుని ఎవరిదో శవం గుండాటన పడుతోంది. చేపలుపట్టుకునేవాళ్ళంతా చుట్టూతా చేరారు. చీకట్లో ఆ శవం ఎవరిదో స్పష్టంగా తెలీటం లేదు. ఒంటిమీది చీర మాత్రం గాలికి లేచిన బుడగలా నీటిమీద తేలాడుతోంది. రోడ్డవతలి ఇళ్ళలోంచి లాంతర్లతో పరుగెత్తుకొచ్చారు జనం. దీపం వెలుగులో శవం ముఖం చూచి భీతిలో కెవ్వున అరిచాను. కనుపెర్లు కమ్మాయి. నా కళ్ళు నన్ను మోసం చేయకపోతే నిజంగా ఆవిడే —

ఆవిడ మెడమీద రక్తంలో గీత గీచినట్టు ఒంటినిండా కత్తిపోట్లు. శరీరం కొరకొరలాడింది ఒంటిమీది తెల్లచీర రక్తాన్ని పూసుకుని పూర్తిగా ఎర్రబడింది.

నా మనస్సుకేమైందో ఏమో చిన్న పిల్లాడిలా ఏడవటం మొదలు పెట్టింది. శరీరంలో ఒణుకు తగ్గడంలేదు. నడిస్తే పళంతప్పి పడిపోతానేమో! భయంతో పరుగెత్తాను.

* * *

తెల్లవారిన తరువాత ఎక్కడవిడితే అక్కడే కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. – "దాని మరెవరితోనో తిరుగుతోందని అనుమానం వేసి ఆ వుంచుకున్న నాయుడు చంపేసేట్ట" అని.

---

# నారదుడు – నరలోక సంచారం

(13 వ పేజీ తరువాయి)

కర్తీ! బదేళ్ళకాలం పూర్తికావచ్చింది. మళ్ళీ ఎన్నికల రంగం సిద్ధం. సాధించిన అభివృద్ధి అంటూ పేపర్లో ఏవో అంకెలు ఎయిర్ కండిషను రూముల్లోంచి బయటపడి. కార్లుదిగి, ఓట్లకోసం పాదయాత్రలు. బలహీనవర్గాల, దళిత వర్గాల అభివృద్ధి, తిండిలేనివాడికి తిండి, భూమిల్లేని వారికి భూములు, ఇలులేనివాళ్ళకు ఇళ్ళు... పాతపాటే మళ్ళీ మొదలు. నారదమునీంద్రా మీరు మాకో సహాయం చేసిపెట్టాలి. చేస్తానంటే చెప్తాను"

"చెప్పు వత్సా! తప్పకచేస్తాను."

'స్వర్గలోకములో వున్న మా గాంధీగారికి ఇలా చెప్పండి. మానాయకులను బదేళ్ళ కొక సారి గాంధీగారు తప్పక గుర్తు వస్తున్నారని, వారి ఆశయాలు, ఆదర్శాలు వల్లిస్తుంటే సభల్లో హాలులు, చప్పట్లు ఇంకా మ్రోగుతూనే వున్నాయని, ఇకముందుకూడ మ్రోగుతూనే వుంటాయని. చాలు. ఇంకేమీ చెప్పకండి'

"వత్సా! దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు శ్రీమన్నారాయణుడు అవతరించాల్సిన సమయం ఆసన్నమయింది"

[illegible]